క్లుప్తంగా

19 నుంచి గురుపూజోత్సవాలు



పోస్టర్లు విడుదల చేస్తున్న బలిజ సంఘ నాయకులు

పుంగనూరు : సద్గురు కైవారం నారాయణ స్వామి మఠంలో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు గురుపూజోత్సవాలు నిర్వహించనున్నట్లు ట్రస్ట్ మెంబర్ ప్రభాకర్ తెలిపారు. శనివారం స్థానిక శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘ నాయకులు పూలత్యాగరాజు, గణేష్, కుమార్, రామకృష్ణ, రమణ, భాస్కర్ ఆధ్వర్యంలో ఆహ్వాన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా త్యాగరాజు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి బలిజ కుటుంబ సభ్యులు అందరూ హాజరుకావాలని కోరారు.

చెస్‌లో విద్యార్థుల ప్రతిభ



గెలుపొందిన విద్యార్థులు

పుంగనూరు : పట్టణంలోని లయన్స్‌క్లబ్, గురుకులం చెస్ క్లబ్ వారు శనివారం నిర్వహించిన చెస్ పోటీలలో 9 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మొత్తం 60 మంది పోటీల్లో పాల్గొనగా, నవ్యశ్రీ, సతీష్, భరత్‌బాలాజీ, గౌతమ్, లోహితాక్షానాయక్, ప్రణవి, ఉషశ్రీ, భువికీర్తి, ధనుష్ విజేతలుగా నిలిచారు. వీరు ఈనెల 18వ తేదీన నంద్యాలలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లనున్నట్లు ఆర్గనైజర్ మణికంఠ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో హరి నామస్మరణం



భజన చేస్తున్న భక్తబృందం

వి.కోట: పట్టణంలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం భక్తిశ్రద్ధలతో హరి నామస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక భజన బృందం ఆధ్వర్యంలో హరి నామస్మరణ పదేళ్లుగా కొనసాగుతోందని ఆలయ అర్చకులు తెలిపారు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం చేపట్టారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



ఇంటి ముందు చేతికందే ఎత్తులో విద్యుత్ తీగ

సదుం : మండలంలోని పుట్టావారిపల్లెలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇళ్ల ముందు చేతికందేంత ఎత్తులోనే వైర్లు ఉండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పశుగ్రాస విత్తనాల పంపిణీ

బంగారుపాళెం: మండలంలోని సంక్రాంతిపల్లె పశు వైద్య కేంద్రం ఆవరణలో శనివారం పాడి రైతులకు రాయితీపై పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ షేక్ ఆసీఫ్ మాట్లాడుతూ రైతులకు రాయితీపై మొక్కజొన్న, జొన్న విత్తనాలు అందిస్తున్నట్లు వెల్లడించారు. అన్ని పశువైద్య కేంద్రాలలో విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మొక్కజొన్న 5 కేజీలు రూ.85, జొన్న విత్తనాలు రూ.115 లకు అందిస్తున్నామన్నారు. పశుగ్రాస విత్తనాలు అవసరమైన రైతులు ఆధార్ కార్డు, భూమి పాస్‌బుక్ జిరాక్సు కాపీలు తీసుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, నలగాంపల్లె పశు వైద్యశాల డాక్టర్ జాన్సీ, వీఎల్‌ఓ నాయక్ పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా కళాశాలల నిర్వహణ



విద్యార్థులను పంపివేయాలని నారాయణ కళాశాల లెక్చరర్‌కు సూచిస్తున్న విద్యార్థి సంఘం నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రమైన చిత్తూరులోని పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా రెండో శనివారం తరగతులు నిర్వహించినట్లు ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి అఖిల్ ఆరోపించారు. ఆ సంఘ నాయకులు శనివారం చిత్తూరు నగరంలో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్ జూనియర్ కళాశాలలను మూయించారు. ఆయన మాట్లాడుతూ నగరంలోని ఆఫీసర్స్ లైన్‌లో ఉన్న నారాయణ, మురుగానపల్లిలోని వివేకానంద, పలు కళాశాలల్లో శనివారం తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. రెండో శనివారం, ప్రభుత్వ సెలవు దినాల్లో తరగతులు నిర్వహించకూడదనే నిబంధన ఉన్నప్పటికీ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థులను ఇబ్బంది పెడితే సహించేది లేదని హెచ్చరించారు. ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణ విషయం ఇంటర్మీడియట్ అధికారులకు తెలిసినప్పటికీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

ఆదాయ బాటలో అన్నదాత

పడమటి మండలాల రైతులు నూతన వ్యవసాయ పద్ధతులతో ముందుకెళుతున్నారు. వినూత్న ఆలోచనలతో మల్చింగ్ విధానానికి శ్రీకారం చుట్టారు. తక్కువ నీటి వినియోగంతో అధిక దిగుబడి సాధిస్తున్నారు. పెట్టుబడి ఖర్చులను గణనీయంగా అదుపు చేసుకుంటూ ఆదాయ మార్గంలో పయనిస్తున్నారు. ఈ క్రమంలో ఉద్యానశాఖ అధికారులు సైతం మల్చింగ్ కల్చర్‌పై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రాయితీపై ప్లాస్టిక్ షీట్లను అవసరాల తగ్గట్టు పంపిణీ చేస్తున్నారు. అన్నదాత ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సహకారం అందిస్తున్నారు.



వి.కోట మండలంలో మల్చింగ్ విధానంలో సాగు చేస్తున్న టమాట

- మల్చింగ్ విధానంపై ఆసక్తి చూపుతున్న రైతులు
- నీటి పొదుపు.. పెట్టుబడి అదుపు దిశగా అడుగులు
- ఒకే ఖర్చుతో రెండు పంటలకు అవకాశం
- ఎకరాకు సరిపడా జలాలతో మూడెకరాల్లో సాగు
- చీడపీడల సమస్యలకు బెడద తక్కువ
- మల్చింగ్ షీట్ల కొనుగోలుపై సబ్సిడీ ఇస్తున్న ఉద్యానశాఖ

పలమనేరు : జిల్లాలోని పడమటి మండలాలకు చెందిన రైతులు మల్చింగ్ విధానంతో పంటలు సాగుచేస్తూ మంచి ఫలితాలను సాధిస్తున్నారు. నీటి ఆదాతో పాటు కలుపు సమస్య తీరడం, కూలీల ఖర్చు తక్కువగా అవుతుండడంతో ఎక్కువ మంది రైతులు మల్చింగ్‌పై దృష్టి సారిస్తున్నారు. ఇప్పటి వరకు కర్ణాటక రాష్ట్రానికే పరిమితమైన ఈ విధానం ఇప్పుడు జిల్లాలోనూ ఊపందుకుంది. దీంతో వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో అధిక ఉత్పత్తులను రైతులు రాబడుతున్నారు.

ఉద్యానశాఖ సబ్సిడీ రూ.16వేలు

హెక్టారు భూమిలో మల్చింగ్ చేయాలంటే 600 మీటర్ల పొడవుగల ప్లాస్టిక్ షీట్ కావాలి. మీటర్ ధర రూ.53 చొప్పున మొత్తం రూ.32వేలు ఖర్చవుతుంది. ఇందులో 50శాతానికి ఉద్యానశాఖ రూ.16వేలు చొప్పున రాయితీ ఇస్తోంది. మల్చి ఇండియా, సోనియో సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, అర్జున్ ఇరిగేషన్ తదితర కంపెనీలు వీటిని విక్రయిస్తున్నాయి.

అందుబాటులోకి కవర్లు

మొక్క చుట్టూ ఉన్న ప్రాంతాన్ని ఏదైనా పదార్థంతో కప్పి ఉంచడాన్నే మల్చింగ్ అంటారు. గతంలో వరి పొట్టు, రంపపు పొట్టు, చెరకు పిప్పి, ఎండిన ఆకులు, వరిగడ్డి, కొబ్బరి పీచులతో మొక్క చుట్టూ కప్పి పెట్టేవారు. ఇప్పుడు వీటి స్థానంలో పలు రకాల మైక్రాన్ కలిగిన ప్లాస్టిక్ కవర్లు అందుబాటులో కొచ్చాయి.



50 నుంచి 100 మైక్రాన్లకు పైగా..

దాదాపు అన్ని రకాల కూరగాయలు, పూల పంటలకు మల్చింగ్ ఏర్పాటు చేసుకోవచ్చు. అయితే 50 మైక్రాన్‌ల కంటే తక్కువగల ప్లాస్టిక్ కవర్లను కూరగాయ పంటలైన టమాట, బీన్స్, వంగ, క్యాప్సికం తదితర పంటలకు వాడుకోవచ్చు. పాటు పూల సాగుకు వంద మైక్రాన్‌ల వరకు వేసుకోవచ్చు. అరటి, బొప్పాయి తదితరాలకు వంద కంటే ఎక్కువ మైక్రాన్‌లను ఉపయోగించుకోవచ్చు. దుక్కి దున్నుకున్న తర్వాత బోదెలు సిద్ధ చేసుకుని ప్లాస్టిక్ పేపర్‌ను బోదెలపై ఉంచుతూ చుట్టూ మట్టిని కప్పుకోవాలి. ఆపై కావాల్సిన చోట రంధ్రాలు చేసి అందులో విత్తనాలు, లేదా మొలకను విత్తుకోవచ్చు.



కొత్త విధానంతో లాభాలెన్నో..

- ఎకరా పంటకు వినియోగించే నీటితోనే మూడెకరాలు సాగు అవుతుంది
- సాధ్యమైనంత వరకు కలుపును నివారించుకోవచ్చు
- కూలీల ఖర్చులు తగ్గుతాయి
- తెగుళ్లు, చీడపీడల సమస్యలు తక్కువగా ఉంటాయి
- వారానికోసారి నీటి తడులు ఇస్తే సరిపోతుంది
- 30 శాతం పంట దిగుబడి పెరుగుతుంది
- పంటకాలాన్ని 40 శాతం పొడిగించుకోవచ్చు
- కవర్‌పై పడే ఉష్ణోగ్రత కారణంగా రసం పీల్చే పురుగులు బెడద తగ్గుతుంది
- భూమిలో తేమ చాలా కాలం ఉంటుంది
- తొలిపంటే కాకుండా అదే భూమిలో రెండో పంటను సాగుచేసే అవకాశముంటుంది
- కూలీలు, పురుగుమందుల పిచికారీ, సస్యరక్షణ తగ్గడంతో ఎకరానికి రూ.20 వేల వరకు ఆదా అవుతుంది
- పంట ఉత్పత్తి పెరుగుతుంది.

మూడు హెక్టార్లలో సాగు చేస్తున్నా



“ నేను కర్ణాటకలో మల్చింగ్ సాగు గమనించా. అక్కడి రైతులతో దీంతో కలిగే లాభాలను తెలుసుకున్నా. గత మూడేళ్లుగా పలు రకాల పంటలను మల్చింగ్‌తో సాగు చేశా. పంట దిగుబడి బాగా వచ్చింది. ముఖ్యంగా కలుపు సమస్య తగ్గడంతో కూలీల ఖర్చు మిగిలింది. ఇప్పుడు మూడు హెక్టార్లలో మల్చింగ్‌తో టమాట సాగుచేస్తున్నా. ఈ విధానం లాభసాటిగా ఉంది.

– సుబ్రమణ్యంరెడ్డి, కల్లాడు, పలమనేరు మండలం

సబ్సిడీ ఇస్తున్నాం



మల్చింగ్ విధానం ద్వారా చాలా లాభాలున్నాయి. ముఖ్యంగా భూమిలో మైక్రో క్లైమైట్ అభివృద్ధి చెందుతుంది. తద్వారా పంట దిగుబడి పెరిగి నాణ్యమైన ఉత్పత్తులు సాధించవచ్చు. మల్చింగ్ విధానంలో సాగు చేసిన రైతులు తాము కొన్న ప్లాస్టిక్ కవర్ల జీఎస్టీ బిల్లు, పట్టాదారు పాస్‌పుస్తకం, బ్యాంకు పాసు పుస్తకం, ఆధార్ కార్డు సమర్పించి దరఖాస్తు చేసుకుంటే హెక్టారుకు రూ.16వేల సబ్సిడీని లబ్ధిదారుడి ఖాతాలోకి జమ చేస్తాం.

– కోటేశ్వరరావు, హార్టికల్చర్ ఏడీ, పలమనేరు

కక్ష పూరితంగానే కేసులు



పీఎస్ నాగరాజు

వి.కోట: కూటమి నేతలు కక్షపూరితంగానే మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై కేసులు బనాయిస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు మండిపడ్డారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై కుట్రపూరితంగా తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. గతంలో రఘురామకృష్ణంరాజుపై నమోదైన కేసు, తదనంతర పరిణామాలను సుప్రీంకోర్టు విచారించిందన్నారు. ఇప్పుడు మళ్లీ కేసు నమోదు చేయడం కచ్చితంగా కుట్రలో భాగమే అని విమర్శించారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల కంటే మంచి పథకాలను అందిస్తామని చెప్పడంతోనే ప్రజలు కూటమిని గెలిపించారన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడం వదిలేసి, కుట్ర రాజకీయాలకు తెరతీయం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తీరు మార్చుకోకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



మలాథియాన్ పిచికారీ చేయిస్తున్న సర్పంచ్ రమేష్ బాబు

పెద్దపంజాణి: మండలంలోని కోగిలేరు, బసవరాజు కండ్రిగ, పొట్టగానిపల్లె, చీకలదిన్నేపల్లె గ్రామాలలో శనివారం ముమ్మరంగా పారిశుద్ధ్య చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ రమేష్ బాబు తెలిపారు. మురుగు నీటి కాలువలు శుభ్రం చేయించి, దోమల నివారణకు మలాథియాన్ పిచికారీ చేయించనట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే రాయలపేట పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ శ్రీనివాసులు, అంగన్ వాడీ వర్కర్ సునీత, ఆశా వర్కర్ లలిత ఇంటింటికీ వెళ్లి జ్వర పీడితుల రక్తనమూనాలు సేకరించారు. రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మురళీ కృష్ణ పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడో..?

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల సమయంలో ఇచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలు ఎప్పుడని కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రాణి యాదవ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు అయినా ఇప్పటి వరకు మహిళలకు ఇచ్చిన ఉచిత బస్సు ప్రయాణం మాట నిలబెట్టుకోకపోవడం అన్యాయమన్నారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాలుగు రోజుల్లోనే ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేశారన్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అమలుకు ఎందుకు ఆలస్యం చేస్తోందని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పాత నేరస్తులకు కౌన్సెలింగ్

తవణంపల్లె : స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద పాత నేరస్తులకు ఎస్‌ఐ అనిల్‌కుమార్ శనివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ సత్ప్రవర్తనతో మెలుగుతూ సమాజంలో మంచి వ్యక్తులుగా నడుచుకోవాలని సూచించారు. ఎవరైనా దౌర్జన్యాలకు దిగినా, ఘర్షణకు పాల్పడినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

రోటరీ క్లబ్‌కు ప్లాటినం అవార్డు



అవార్డు అందుకున్న అనిల్‌కుమార్, రాజారెడ్డి తదితరులు

పుంగనూరు : పట్టణంలోని రోటరీ క్లబ్‌కు ప్లాటినం అవార్డుతో పాటు 15 ప్రశంసాపత్రాలు దక్కినట్లు క్లబ్ ప్రతినిధి రాజారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో రోటరీ గవర్నర్ ఉదయ్‌కుమార్ చేతుల మీదుగా రోటరీ ప్రెసిడెంట్ అనిల్‌కుమార్, కార్యదర్శి రాజారెడ్డి ప్లాటినం అవార్డు అందుకున్నారు. అలాగే ప్రతినిధులు డాక్టర్ శరణ్, డాక్టర్ ప్రభాకర్‌తో పాటు సుధాకర్‌రెడ్డి, అర్షద్‌అలీ, హరిప్రసాద్, కిషోర్, భాస్కర్‌రెడ్డి ఉత్తమ సేవలకు ప్రశంసాపత్రాలు పొందారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ రోటరీ ద్వారా మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించి , ఆదర్శంగా నిలుస్తామని వెల్లడించారు.

ప్రాణం పెట్‌తున్నారు!

పెంపుడు కుక్కలపై పలువురు ప్రేమాభిమానాలు పెంచేసుకుంటున్నారు. పెట్స్‌ను గారాబం చేస్తూ ప్రాణం పెట్టేస్తున్నారు. కుటుంబసభ్యుల్లో ఒకరిలా భావిస్తూ వాటిని అత్యంత జాగ్రత్తగా చూసుకుంటున్నారు. మక్కువతో పెంచుకుంటున్న శునకాలకు చిన్నపాటి అనారోగ్య సమస్య తలెత్తినా తల్లడిల్లిపోతున్నారు. తమ జీవన గమనంలో కుక్కలకు ప్రత్యేక స్థానం కల్పిస్తున్నారు. వాటిని అందంగా అలంకరించి వ్యాహ్యాళికి తీసుకెళుతూ మురిసిపోతున్నారు.



కుక్కకు బాతింగ్



పెట్ షాపులో అలంకరణ సామగ్రి

- పెంపుడు కుక్కల పెంపకంపై ఆసక్తి చూపుతున్న ప్రజలు
- చిత్తూరులో పెరిగిన శునక ప్రేమికులు
- అందుబాటులో డాగ్స్ అలంకరణ సామగ్రి, వైద్య సేవలు

కాణిపాకం : జంతు ప్రేమికులు అధికంగా కుక్కలను పెంచుకోవడానికి ఆసక్తి చూపుతుంటారు. పెట్ పెంపకానికి భారీగా వెచ్చిస్తుంటారు. జీవితంలో పెంపుడు ప్రాణులను భాగస్వామ్యం చేస్తుంటారు. ఇంట్లో పిల్లల మాదిరిగా కుక్కకు ప్రత్యేక గుర్తింపు ఇస్తుంటారు. ఈ క్రమంలోనే శునక ప్రేమికుల సంఖ్య చిత్తూరు పరిసరాల్లో గణనీయంగా పెరుగుతోంది. సుమారు 2,410 వరకు పెంపుడు కుక్కలు (పెట్స్) ఈ ప్రాంతంలో ఉన్నాయి. వీటి పెంపకంపై చిత్తూరు వాసులు మక్కువ పెంచుకుంటున్నారు. ఇంటి నేస్తంగా చూసుకుంటున్నారు. ఎక్కడికెళ్లినా వెంట తీసుకుతున్నారు. మార్కెటింగ్, షాపింగ్, పార్లర్, ఫంక్షన్ ఇలా ఎక్కడికెళ్లినా స్నేహితుడిలా, ఆప్తుడిలా, వెంట తెచ్చుకుంటూ ఉప్పొంగిపోతున్నారు. నగరంలో దాదాపు 50 జాతుల పెట్స్ సందడి చేస్తున్నాయి. వాటిలో లాబ్రొడార్, జర్మన్ షెపర్డ్, గోల్డెన్ రిట్రీవర్, షిట్జూలతో పాటు మరికొన్ని జాతి కుక్కలు ఇక్కడ లభిస్తున్నాయి. వీటి ధర రూ.6వేల నుంచి రూ. ఒక లక్ష వరకు పలుకుతోంది. పెట్స్ పెంపకానికి అవసరమైన అన్ని రకాల వస్తువులు, మందులు, వైద్యం కూడా చిత్తూరులో అందుబాటులో ఉన్నాయి.

అలంకరణ సామగ్రి సైతం..

నగరంలోని సుందరయ్యవీధిలోని పెట్ షాప్‌లో కుక్కల పెంపకానికి కావాల్సిన వస్తువులు అంటే , చైన్లు, స్టిక్స్, నెక్‌బెల్ట్స్, రోప్స్, క్యాట్ లిటర్, పెట్ డ్రైవర్స్, తదితర అలంకరణ సామగ్రి అందుబాటులో ఉంది. డైపర్స్‌తోపాటు అన్ని రకాల మందులు, ఫుడ్, బొమ్మలు కూడా విక్రయిస్తున్నారు. ముఖ్యంగా పెట్‌కు అవసరమ్యే అన్ని రకాల వ్యాక్సిన్లు లభిస్తున్నాయి. కుక్కల కొనుగోలుతో పాటు ప్రేమికులు వాటి భద్రంగా చూసుకుంటున్నారు. పెంపకంలో ఖర్చులకు వెనకాడడంలేదు. వాటిని ట్రైనింగ్‌కు కూడా పంపుతున్నారు.


స్టైలిష్‌గా సిద్ధం చేస్తూ..

సమాజంలో మనిషి స్టైలిష్‌గా కనిపించాలని తాపత్రయపడుతుంటాడు. ఇందు కోసం వేలాదిరూపాయలు వెచ్చిస్తుంటాడు. అలాగే కొందరు తాము పెంచుకునే కుక్కలను అందంగా చూసుకోవాలని భావిస్తుంటారు. అటువంటి పెట్ ప్రియుల కోసం సుందరయ్య వీధిలో పెట్ బోటిక్ స్పా పేరుతో ఓ షాపును సైతం ప్రారంభించేశారు. ఇక్కడ కుక్కలకు బాతింగ్, హేర్ కటింగ్, జీరో కటింగ్, నెయిల్ కటింగ్, ఇయర్ క్లీనింగ్, పాస్ క్లీనింగ్ వంటివి చేస్తున్నారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకునేందుకు పెట్ ప్రియులు ఆ దుకాణానికి క్యూ కడుతున్నారు.



కుక్కకు హేర్ కటింగ్

పెట్ లవర్స్‌కు అనుగుణంగా..



చిత్తూరులో పెట్ లవర్స్ పెరిగారు. అందుకు అనుగుణంగానే పెట్ బొటిక్ స్పా వసతిని అందుబాటులోకి తీసుకువచ్చాం. కుక్కల పెంపకానికి అవసరమైనవి అన్నీ ఇక్కడ ఉన్నాయి. అలాగే వైద్యం, ట్రైనింగ్ వంటివి సర్వీసులుంటాయి. వీటి కోసం చిత్తూరుతో పాటు పూతలపట్టు, జీడీనెల్లూరు పరిసరాల ప్రాంతాల నుంచి కూడా మా షాపునకు వస్తున్నారు.

– మోహన్‌రెడ్డి, శ్రీబాల పెట్ షాపు యజమాని, చిత్తూరు

శుభ్రంగా ఉంచుకోవాలి



పెంపుడు కుక్కలను చాలా మంది అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. అయితే వాటి పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి. విధిగా వ్యాక్సిన్ వేయించాలి. జబ్బుపడితే వెంటనే వెద్యులను సంప్రదించి చికిత్సలందించారు. ప్రధానంగా వాటిని శుభ్రంగా ఉంచుకోవాలి. లేకుంటే వాటి నుంచి మనిషికి వ్యాధులు వచ్చే ప్రమాదముంది.

– సురేష్, పశుసంవర్ధక శాఖ సహాయకుడు, తాళంబేడు సచివాలయం, చిత్తూరు

బాధ్యతగా లేగదూడల పోషణ

- వ్యాధులపై అప్రమత్తత అవసరం
- సంరక్షణలో జాగ్రత్తలు తప్పనిసరి
- పశు వైద్యాధికారి షేక్ ఆసిఫ్



డాక్టర్ షేక్ ఆసిఫ్



ఆవు దూడలు

బంగారుపాళెం: నేటి లేగదూడలే రేపటి పాడి ఆవులుగా భావించాలని, బాధ్యతగా వాటి పోషణకు చర్యలు చేపట్టాలని ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ షేక్ ఆసిఫ్ సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ దూడలకు సాధారణంగా వచ్చే వ్యాధులకు క్రమం తప్పకుండా టీకాలు, వైద్యం చేయించాలని తెలిపారు. భవిష్యత్‌లో ఆరోగ్య వంతమైన పాడి పశువులు అందుబాటులోకి రావాలంటే జాగ్రత్తలు తప్పనిసరని వెల్లడించారు. దూడల పోషణ, వాటి ఆరోగ్యానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆయన పలు సూచనలు చేశారు.

- **తెల్ల విరేచనాలు :** మోతాదుకు మించి పాలు తాగించడం వల్ల అజీర్తి చేసి దూడలు తెల్లగా పారుకుంటాయి. లేదంటే సూక్ష్మజీవులు, నట్టల కారణంగా కూడా దూడలకు విరేచనాలు అవుతుంటాయి. అలాంటి సమయంలో పాల మోతాదు తగ్గించి గ్లూకోజ్, ఉప్పు నీరు కలిపిన మిశ్రమాన్ని తాగించాలి. తర్వాత పశువైద్యుడిని సంప్రదించి తగిన చికిత్స చేయించాలి. పాలలో ఒక చెంచా మోతాదులో యాంటీబయాటిక్ మందు కలిపి వరుసగా ఐదు రోజులు తాగిస్తే మంచిది
- **న్యుమోనియా :** దూడలకు చలి, ఈదురుగాలులు సోకితే న్యుమోనియా వచ్చే అవకాశం ఎక్కువ. కాబట్టి చలి, ఈదురుగాలుల నుంచి దూడలను రక్షణ కల్పించాలి. న్యుమోనియా సోకిన దూడలకు జ్వరం వస్తుంది. శ్వాస పీల్చడం కష్టమవుతుంది. వ్యాధి ముదిరితే చనిపోయే ప్రమాదముంది. అందువల్ల జర్వం వచ్చిన వెంటనే డాక్టరును సంప్రదించి చికిత్స చేయించాలి.
- **బొడ్డు వాపు :** దూడ పుట్టినప్పుడు శుభ్రమైన బ్లేడు లేదా కత్తెరతో బొడ్డును రెండు అంగుళాల పొడవుంచి కత్తిరించి టించర్ అయోడిన్ అద్దాలి. ఇలా చేయక పోతే సూక్ష్మజీవులు వృద్ధి చెంది బొడ్డు వాపు వచ్చే ప్రమాదముంది. ఇది వ్యాపిస్తే వెంటనే చికిత్స చేయించాలి.
- **మలబద్ధకం :** దూడల్లో మలబద్ధకం సాధారణంగా కనిపిస్తుంది. చలికాలంలో గేదె దూడలకు ఎక్కువగా ఈ సమస్య వస్తుంది. దూడకు తగినన్ని ముర్రుపాలు తాగిస్తే మలబద్ధకం రాదు. అలాగే పాలలో కోడిగుడ్డు సొన, ఇంగువ, బెల్లం కలిపి రెండు రోజులు తాగిస్తే తగ్గిపోతుంది. లేదంటే ఎనిమా ఇప్పించాలి.
- **నట్టల బెడద :** దూడలకు సాధారణంగా నట్టల బెడద ఉంటుంది. గేదె దూడల్లో ఈ సమస్య ఎక్కువ. నట్టలు ఉంటే తరచూ విరేచనాలతో ఎదుగుదల ఉండదు. వెంట్రుకలు బిరుసుగా మారుతాయి. కడుపు కింద జారి కనిపిస్తుంది. దవడల మధ్య నీరు చేరి ఉంటుంది. సకాలంలో నట్టల నివారణ మందు తాగించాలి. 8 నుంచి 10 రోజుల వయసులో ఒకసారి, ఆ తర్వాత నెలకు ఒకసారి చొప్పున నాలుగు నెలల వరకు క్రమం తప్పకుండా నట్టల నివారణ మందు తాగించాలి.
- **పేలు, గోమార్లు, పిడుదులు :** గేదె దూడలకు మూడు మాసాలు దాటిన తర్వాత నెలకోసారి సంవత్సరం వరకు శరీరంపై వెంట్రుకలు కత్తిరిస్తే పేలు, గోమార్లు, పిడుదులు రాకుండా కాపాడుకోవచ్చు.
- **కాక్సిడియోసిస్ :** ఈ వ్యాధి సోకడం వల్ల దూడలు రక్త విరేచనాలతో బాధపడతాయి. 15 రోజులకు ఒకసారి పశువుల కొట్టంలో సున్నం చల్లితే కాక్సియోసిస్ వ్యాధి రాకుండా నివారించుకోవచ్చు.
- **అంటువ్యాధులు :** దూడలకు ఆరు నుంచి ఎనిమిది వారాల వయసులో మొదటిసారిగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి. 6వ నెలలో రెండోసారి ఇదే టీకా వేయించాలి. అలాగే ఆరుమాసాల సమయంలో జబ్బ వాపు, గొంతు వాపు వంటి వ్యాధుల నివారణకు టీకాలు వేయించాలి. దూడలు పుట్టిన 7 నుంచి 10 రోజుల వయసులో మొదటిసారి, ఆ తర్వాత ప్రతి మూడు నాలుగు వారాలకు ఒకసారి నట్టల నివారణ మందు (డీవార్మింగ్) తాగించాలి.

- **పోషణ ఇలా :** దూడ పుట్టిన అరగంటలోపు ముర్రుపాలు తాగించాలి. ఇందులో రోగ నిరోధక శక్తిని పెంచే యాంటీబాడీస్ ఎక్కువగా ఉంటాయి. దూడ శరీర బరువులో పదో వంతు పాలు తాగించాలి. దూడ 20 కిలోల బరువు ఉంటే రోజూ రెండు లీటర్ల పాలు అందివ్వాలి. మొదటి మూడు నెలల్లో దూడకు 240 లీటర్ల వరకు పాలు ఇవ్వాలి. మూడో నెల నుంచి దాణాతో పాటు పచ్చిగడ్డి తినిపించడం అలవాటుచేయాలి. ఖనిజ లవణ మిశ్రమ ఇటుకలను దూడలు నాకేలా అందుబాటులో ఉంచితే మట్టి తినకుండా నివారించవచ్చు.